క్లుప్తంగా

రాజ్‌పుత్ సమాజ సంఘం అధ్యక్షుడిగా మహేశ్ ఠాకూర్


మహేశ్ ఠాకూర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

తాండూరు టౌన్: తాండూరు రాజ్‌పుత్ సమాజ సంఘ అధ్యక్షుడిగా మహేశ్ ఠాకూర్‌ను నియమించారు. ఆదివారం సమాజ సభ్యులు ఇందిరానగర్‌లోని భవానీమాత ఆలయంలో సమావేశమై ఏకగ్రీవంగా మహేశ్ ఠాకూర్‌ను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండోసారి తనకు అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు సమాజ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్లవేళలా సమాజ సభ్యులకు అండగా ఉంటూ, సంఘ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. త్వరలోనే పూర్తిస్థాయికార్యవర్గాన్ని నియమిస్తామన్నారు. అనంతరం మహేశ్ ఠాకూర్‌ను సభ్యులు ఘనంగా సన్మానించారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

అనంతగిరి: శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆదివారం డాక్టర్ జయంతిక జ్ఞాని, సత్యనారాయణగౌడ్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి జిల్లా ప్రతినిధులు బసవేశ్వర్, వేణుగోపాల్, సత్యం, లక్ష్మణ్, భీంరెడ్డి, సుధీర్, కిశోర్, భాను తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత


దాత సుధీర్‌జైన్‌ను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

చేవెళ్ల: ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో పాలు పంచుకొని మానసిక ప్రశాంతత పొందాలని చందిప్ప మరకత శివలింగ ఆలయ కమిటీ చైర్మన్ సదానంద్‌గౌడ్ అన్నారు. ఆదివారం శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప గ్రామంలో ఉన్న బ్రహ్మసూత్ర మరకత శిలింగ ఆలయాన్ని హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త సుధీర్ జైన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన శివలింగాన్ని దర్శించుకొని ఆలయ చరిత్రను చైర్మన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ అభివృద్ధికి తనవంతు సాయంగా రూ.1,11,111 చైర్మన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎంతో పవిత్రమైన ఈ మరకత శివలింగాన్ని దర్శించుకున్న వారి కోరిన కోరికలు తీరుతున్నాయని చెప్పారు. అరుదుగా ఉండే మరకత శివలింగానికి ఎన్నో ఏళ్ల చరిత్ర ఉందని తెలిపారు. సందర్భంగా దాత సుధీర్‌జైన్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భక్తులు తదితరులు ఉన్నారు.

నేడు బీజేపీ విస్తృతస్థాయి సమావేశం

కొత్తూరు: పట్టణంలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో మధ్యాహ్నం 3 గంటలకు కొత్తూరు, నందిగామ మండలాల కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ కో–కన్వీనర్ అమడపురం నర్సింహ్మగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణతో పాటు పలువురు ముఖ్యులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

కేశంపేట: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ముఖ్య అతిథిగా హాజరుకానున్న కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రొల్ల రాఘురాంగౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలోని శారద ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశం ఉంటుందని తెలిపారు.

మా ఉద్యోగాలను క్రమబద్ధీకరించండి

మాడ్గుల: సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని మాడ్గుల మండల సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలకు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించు కోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చట్టాలు చెబుతున్నా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫల మవుతోందని విమర్శించారు. వెంటనే తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు.

మట్టి రోడ్డుతో అవస్థలు

- అధ్వానంగా మద్వాపూర్–కోట్‌పల్లి రహదారి
- ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు


మద్వాపూర్-కోట్‌పల్లి రోడ్డు

బంట్వారం: మట్టి రోడ్డుతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. అత్యవసర సమయంలో గ్రామంలోకి ఆటోకూడా రాలేని పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బంట్వారం మండల పరిధిలోని మద్వాపూర్ గ్రామం నుంచి కోట్‌పల్లికి వెళ్లే రోడ్డు మట్టి రోడ్డుగా ఉంది. ఈ రోడ్డు పంచాయతీరాజ్ పరిధిలోకి వచ్చే ఈ రోడఉడ సుమారు 4 కిలో మీటర్లు ఉంటుంది. లింకు రోడ్డు కావడంతో వాహనదారులతో పాటు బాటసారులు ఎక్కువగా ఇటుగానే వెళ్తుంటారు. సల్బత్తాపూర్ మీదుగా వెళ్తే దూరం ఎక్కువవుతుందని మద్వాపూర్ వాసులు కోట్‌పల్లికి నిత్యం ఇదే మట్టిరోడ్డుపై ప్రయాణిస్తున్నారు. ఆటోలు కూడా నడవలేని ఈ గతుకుల రోడ్డు మీద బైక్‌లే అతి కష్టం మీద వెళ్తుంటాయి.

సంతకు కాలనడకనే..

ప్రతి సోమవారం కోట్‌పల్లిలో సంత జరుగడంతో మద్వాపూర్ గ్రామస్తులు ఎక్కువగా కాలినడకనే ఎంచుకుంటారు. వర్షాకాలమైతే కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి ఉంటుంది. కనీసం మెటల్ రోడ్డు వేసినా బాగుండేదని స్థానికులు అంటున్నారు. సమస్యను పలుమార్లు సంబంధిత పంచాయతీరాజ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను పీఆర్ అధికారులు ప్రభుత్వానికి పంపాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.

బీటీ రోడ్డు వేయాలి



మద్వాపూర్ నుంచి కోట్‌పల్లికి వెళ్లే మట్టి రోడ్డును బాగుచేయాలి. ఈరోడ్డుపై వర్షాకాలం కాలినడకన కూడా వెళ్లలేని దుస్థితి ఉంటుంది. కనీసం కంకర రోడ్డు వేసిన అందరికీ సౌకర్యంగా ఉంటుంది. చాలాకాలంగా కోరుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి బీటీ రోడ్డు వేయాలి. స్పందించకుంటే గ్రామస్తులతో కలిసి ధర్నా చేస్తాం.

– నరేష్, మద్వాపూర్

యువత క్రీడల్లోనూ రాణించాలి

బీజేపీ మండల అధ్యక్షుడు బంధయ్య


క్రీడాకారులతో బీజేపీ నేతలు

కుల్కచర్ల: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని బీజేపీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు బంధయ్య, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. ఆదివారం చౌడాపూర్ మండల పరిధిలోని కొత్తపల్లిలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. వారు మాట్లాడుతూ... క్రీడలతో శరీర ధృడత్వంతో పాటు మానశిక ప్రచాంతత కలుగుతుందని అన్నారు. ఒత్తిడిని జయించడం, ఓర్పు, సహనం వంటివి అలవరుతాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బీజేవైఎం మండల అధ్యక్షుడు శరత్‌కుమార్, నాయకులు అశోక్, మాసయ్య, కొత్తపల్లి గ్రామస్తులు విష్ణు, రాజు, వెంకటేశ్, శ్రీశైలం, రవి, హన్మంతు, నాని, భరత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిమెట్ల నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న సరిత, మహేందర్‌రెడ్డి దంపతులు

యాచారం: మండల పరిధిలోని మొండిగౌరెల్లి గ్రామంలోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి దేవాలయ మెట్ల నిర్మాణానికి విరాళం అందజేశారు. గ్రామానికి చెందిన పొరెడ్డి శారదమ్మ జ్ఞాపకార్థం ఆమె చిన్న కూతురు మొయినాబాద్ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన సరిత, మహేందర్‌రెడ్డి దంపతులు ఆదివారం ఆలయ కమిటీ నిర్వాహకులకు రూ.10,00,116లు విరాళం అందజేశారు. స్వయంభు దేవాలయ అభివృద్ధి కోసం మరింత ఆర్థిక సహాయం చేస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గుర్రం చెన్నకేశవరెడ్డి, వల్లంల బాల్‌రెడ్డి, మేకల యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి


విరాళం రసీదు ఇస్తున్న ఉమాపతి

కమిటీ సభ్యుడు డాక్టర్ రవీంద్ర యాదవ్

కొడంగల్: బండల ఎల్లమ్మ ఆలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీధర్మ శాస్త అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని ఆలయ కమిటీ సభ్యుడు డాక్టర్ రవీంద్ర యాదవ్, నర్సిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఉమాపతి గౌడ్, జగదీష్ కుమార్ ఢాగ కోరారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. అయ్యప్ప సేవా సమితి సభ్యులు, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ ఏడాది కార్తీక మాసంలోపు పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అయితే నిధుల కొరత వల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. దాతలు సహకరించాలని కోరారు. గతంలో ఆలయ నిర్మాణానికి తమవంతు విరాళం ఇస్తామని ముందుకు వచ్చిన భక్తులు వారి విరాళాలు చెల్లించి సహకరించాలన్నారు. కొడంగల్‌కు చెందిన జగదీష్ కుమార్ ఢాగ ఆలయ నిర్మాణానికి తనవంతు విరాళంగా రూ.లక్ష అందజేశారు.

ప్రభుత్వం కూలీ రేట్లను పెంచింది


కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ: జాబ్‌కార్డు ఉన్న ప్రతి కూలీ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మహేశ్ బాబు అన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని మోత్కుర్‌లో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పని చేస్తున్న కూలీలకు కూలీరేట్లను రూ.272 నుంచి రూ.300కు పెంచిందని చెప్పారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇది అమల్లో ఉంటుందన్నారు. ప్రతి కూలీకి పని ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మంచినీరు, టెంట్లు, ప్రాథమిక చికిత్సకు అవసరమైన మందులను అధికారులు అందుబాటులో ఉంచారని అన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీ పనిచేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా బోరుబావుల తవ్వకాలు

ప్రభుత్వ ఆదాయానికి గండి

కొడంగల్: నియోజకవర్గంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా బోరుబావులను తవ్వుతున్నారు. నిబంధనల ప్రకారం బోరు డ్రిల్లింగ్ చేయాలంటే రెవెన్యూ, అటవీ, గ్రామ, మున్సిపల్ అధికారుల అనుమతి తీసుకోవాలి. అయితే వీటిని పట్టించుకోకుండా బోరుబండ్ల యజమానులు రాత్రుల సమయంలో బోర్లు వేస్తున్నారు. నీళ్లు పడితే ఏ సమస్య ఉండదు. నీళ్లు పడకపోతే తవ్విన రంధ్రాలను అలాగే వదిలేసి వెళ్లిపోతున్నారు. దీంతో చిన్నారులు ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. గతంలో ఇలాంటి రంధ్రాల్లో పడి చిన్నారులు చనిపోయిన ఘటనలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల బోరుబావుల తవ్వకాలు పెరగిందనే ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి కూడా గండి పడుతోందని తెలిపారు.ప్రస్తుతం తెలంగాణాలో భూగర్భజాలాలు అడుగింటిపోయిన పరిస్థితుల్లో ఇష్టారాజ్యంగా బోరుబావుల తవ్వకాన్ని నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యలపై హెల్ప్ డెస్క్: కమిషనర్

చేవెళ్ల: వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. మండుతున్న ఎండల నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యల నివారణకు శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో సీడీఎంఏ, జిల్లా కలెక్టర్‌ల ఆదేశాల మేరకు ఈ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ వేసవిలో నీటి ఎద్దడి నివారణ నిమిత్తం ఏ ప్రాంతంలోనైనా సమస్యలు తలెత్తితే వాటిని సత్వరమే పరిష్కరించటానికి ఈ హెల్ప్ డెస్క్ ఉపయోగపడుతుందని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడైనా నీటి సమస్యలు ఏర్పడితే హెల్ప్ డెస్క్ నెంబర్ 9704328088ను సంప్రదించాలని కోరారు. ప్రజలు నీటి వృథాను అరికట్టి, పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

ఆస్తిపన్నులపై 5 శాతం రాయితీ

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పట్టణ ప్రజలకు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నును ఈనెల 30వ తేదీలోపు చెల్లించిన వారికి 5 శాతం రాయితీని ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. ఆస్తి పన్నులు చెల్లించని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెంటనే పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధిలో భాస్వాములు కావాలని ఆయన సూచించారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన చింతకుంట రమేశ్ అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డిలు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసుయాదవ్ రూ. 3వేలు, ప్రభాకర్‌రెడ్డి రూ. 3వేలు అందజేశారు. అదేవిధంగా ఇస్రాయిపల్లికి చెందిన కృష్ణయ్యకు ప్రభాకర్‌రెడ్డి రూ. 3వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో అజీజ్, రాజు, వెంకటేశ్, కిరణ్, మహేశ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'మోడల్' ప్రవేశ పరీక్ష


తాండూరు రూరల్: పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఐనెల్లి శివారులో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్లో ఆదివారం మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి 10వ తరగతి ప్రవేశానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 6వ తరగతి ప్రవేశానికి 169 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 133 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 7వ తరగతి నుంచి 10వ తరగతి ప్రవేశానికి 265 మంది దరఖాస్తు చేసుకోగా 200 మంది విద్యార్థులు పరీక్ష రాశారని అధికారులు తెలిపారు.

కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లో..

కుల్కచర్ల: మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ప్రశాంతంగా జరిగింది. ఉదయం జరిగిన 6వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం 184మంది దరఖాస్తు చేసుకోగా 166మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మధాహ్న సమయంలో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశపరీక్ష నిర్వహించగా 127 మంది దరఖాస్తు చేసుకోగా 117మంది విద్యార్థులు పరీక్ష రాశారని అధికారులు తెలిపారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి

యాచారం: ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో పురాతన దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి పేర్కొన్నారు. మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం కొత్తపల్లి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కోదండరెడ్డి, సావిత్రమ్మ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురాతన దేవాలయాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు కట్టికొమ్ముల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేసిన పనులే చిరస్థాయిగా నిలిచిపోతాయి


శ్రీనివాస్ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, నాయకులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్

కడ్తాల్: జీవితంలో మనం చేసిన మంచి పనులే చిరస్థాయిగా నిలిచిపోతాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని కేశవరెడ్డి గార్డెన్‌లో, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తండ్రి నారాయణరెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరై, గూడూరు నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యాయులు గూడూరు రవీందర్‌రెడ్డి, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, సూదిని రాంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎస్సీసెల్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు గోపాల్, రాములుగౌడ్, లచ్చిరామ్ నాయక్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

నందిగామ: క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చేగూరులో మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా నిర్వహించిన చేగూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులు ఇలాంటి టోర్నమెంటులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో గెలుపు ఓటమిలు సర్వసాధారణమని వివరించారు. గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటులో సన్ రైజర్స్ టీమ్ విజేతగా నిలవడంతో ఈ టీమ్‌కు బహుమతులతో పాటు మెమొంటోను అందజేశారు. అదేవిధంగా రన్నర్ జట్టుగా చెన్నై సూపర్ కింగ్స్ నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దారుర్ సతీష్, ఎంపీటీసీ దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్ రెడ్డి, నర్సింహాయాదవ్, మంకాల శ్రీశైలం, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు


బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో అదే గ్రామానికి చెందిన ప్రకాశ్‌గౌడ్ సహకారంతో రోడ్డు ప్రమాదాల నివారణకు ఆదివారం బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు సహకారాన్ని అందించాలన్నారు. రహదారి నియమాలను పాటించి వాహనాలను నడపాలని తెలిపారు. బారికేడ్లను ఏర్పాటు చేయడంతో వాహన వేగాన్ని నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చూడవచ్చన్నారు. వేగం కన్నా గమ్యం ముఖ్యమని, వాహనదారులు వాహనాలను నిదానంగా నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారని, వారికి మనమందరం సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు బుచ్చిలింగంగౌడ్, అంజయ్య, శ్రీశైలం, ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్య, శంకర్, శివుడు, సురేష్, శ్రీనివాస్, శ్రీశైలం, చంద్రయ్య, కృష్ణ, శ్రీనివాస్, నాగభూషణం, యోగి, మనోహర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై పోరాటం


దోమ: నియామకపత్రం అందుకుంటున్న మహేశ్

సంఘం మండల అధ్యక్షులు చుక్కయ్య, చంద్రయ్య

దోమ: నూతన కమిటీ సభ్యులు దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని భారత దివ్యాంగుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు చుక్కయ్య అన్నారు. ఆదివారం దోమ మండల పరిధిలోని ఐనాపూర్‌లో భారత పరిరక్షణ సమితి నూతన గ్రామ కమిటీను ఆయన ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా నవనీత, కార్యదర్శిగా వెంకటయ్య, ఉపాధ్యాక్షుడిగా శ్రీనివాస్, మీడియా కన్వీనర్‌గా ఆంజనేయులు, కోశాధికారిగా బాల్‌రాజ్, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా ఎన్నికైన మహేశ్‌కు ఆయన నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాములు, అనూష, నరేశ్, అంజలి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం నిరంతరం పోరాటం..

పరిగి: దివ్యాంగులహక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడు చంద్రయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గోవింద్‌పూర్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్ ఎన్నుకున్నారు. చంద్రయ్య మాట్లాడుతూ.. అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. ఎవరికి ఏ సాయం కావాలన్నా తమదృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. వికలాంగులు ఐకమత్యంగా ఉంటేనే సమస్యలను పరిష్కరించుకునేందుకు వీలుంటుందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి అందరికీ ఐక్యం చేస్తానని అన్నారు. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు

- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి
- బీజేపీలో చేరిన ధారూరు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాజునాయక్


కొండా సమక్షంలో బీజేపీలో చేరిన నాయకులు

ధారూరు: ధారూరు మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రాజునాయక్, మాజీ ఎంపీపీ ఉమాపార్వతి ఆదివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ధారూరులోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన బీజేపీ సమావేశంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వీరికి కండువాలు కప్పి కమలం పార్టీలోకి ఆహ్వానించారు. వీరితో పాటు నాగసమందర్, రుద్రారం, స్టేషన్‌ధారూరు, కొండాపూర్‌కలాన్ గ్రామాల మాజీ సర్పంచ్‌లు.. చంద్రకళ, చంద్రమ్మ, రేణుక, పరమేశ్, బీఆర్‌ఎస్ నాయకులు.. లక్ష్మారెడ్డి, అనిల్, శ్రీనివాస్, రాంచందర్, రాములు తదితరులు బీజేపీలో చేరారు. వీరందరినీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. మరికొంత మంది బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్‌లు, నాయకులు ఈనెల 10న బీజేపీలో చేరనున్నట్లు సమాచారం. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఇస్తామని కొండా తెలిపారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.